నమస్తే తెలంగాణ
వరంగల్
5 | వరంగల్, ఆదివారం 29 సెప్టెంబర్ 2024 | WARANGAL

తాడ్వాయి అటవీ ప్రాంతంలో ధ్వంసమైన వృక్షాలను పరిశీలిస్తున్న వినోద్‌కుమార్

ప్రకృతిని మనిషి ఎదిరించలేడు

అడవి పునరుద్ధరణ చేపట్టాలి

- ఉపద్రవాలను అరికట్టేందుకు కృషి చేయాలి
- తాడ్వాయికి స్పెషల్ ప్యాకేజీని ప్రకటించాలి
- కంపా నిధులతో రక్షణ చర్యలు చేపట్టాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

ములుగు, (నమస్తేతెలంగాణ)/తాడ్వాయి,సెప్టెంబర్ 28 : ప్రకృతిని మానవుడు ఎదిరించలేడనడానికి ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అటవీ ప్రాంతంలో గత నెల 31న జరిగిన ప్రకృతి విపత్తుతో రుజువైందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి అడవి పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన ములుగు జిల్లాలో పర్యటించారు. మేడారం అటవీ ప్రాంతంలో ధ్వంసమైన భారీ వృక్షాలను అటవీ శాఖ మాజీ డీఎఫ్‌వో, జన విజ్ఞాన వేదిక వరంగల్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. మేడారంలో చోటుచేసుకున్న ఉపద్రవం ఇంతకు ముందు ఎన్నడూ జరగలేదని అన్నారు. మంత్రి కొండా సురేఖ కేంద్ర ప్రభుత్వ కంపా నిధుల కోసం లేఖ రాయాలన్నారు. మంత్రి సీతక్క నేలకూలిన అడవిని కాపాడేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలన్నారు. ప్రకృతిపై ప్రతి ఒక్కరికీ ప్రేమ ఉండాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. 1500 ఎకరాల్లో 50 వేల నుంచి 80 వేల వృక్షాలు నేలకూలాయని, అవి మళ్లీ పెరిగే వరకు ప్రజలు సంచరించకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి చెందిన తెలంగాణ ఎంపీలు కంపా నిధులను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాది హరితహారం కార్యక్రమం ద్వారా కోట్లాది మొక్కలను నాటామని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అది అటకెక్కిందని తెలిపారు. టోర్నడోను మించిన విపత్తు సంభవించి వేలాది ఎకరాల్లో ఎన్నో ఏళ్ల నాటి భారీ వృక్షాలు, చెట్లు పై నుంచి కింది వరకు చీలిపోయాయన్నారు. తుఫాను కారణంగా సుడిగాలులు రెండు వైపులా ఒకే సమయంలో వచ్చి ఇంతటి ఉపద్రవం చోటు చేసుకుందన్నారు. ఇప్పటికైనా మానవులంతా ప్రకృతిపై ప్రేమను చూపించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తాడ్వాయికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపి త్వరగా అటవీ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. ధ్వంసమైన అటవీ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా 500 మీటర్ల చొప్పున మనుషులు ప్రవేశించకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. లేనట్లయితే ఈ ప్రాంతం కబ్జాకు గురయ్యే అవకాశాలున్నాయన్నారు. అటవీ ప్రాంతాన్ని పునరుద్ధరించేందుకు సహజ సిద్ధమైన మొక్కలను నాటడంతో పాటు ఐదు సంవత్సరాల పైబడిన చెట్లను తీసుకొచ్చి ప్లాంటేషన్ చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నీళ్లు, నియామకాలు అనే నినాదంతో సాధించుకున్న రాష్ట్రంలో నేడు ప్రకృతి కూడా ఒక భాగమైందని వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు, జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ బడే నాగజ్యోతి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోవింద్‌నాయక్, ఇతర నాయకులు ఉన్నారు.

చెరువులు నింపకుండా నీటిని తరలించొద్దు

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : తపాస్‌పల్లి రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిట్ట, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని చెరువులను గోదావరి జలాలతో నింపిన తర్వాతనే ఇతర ప్రాంతాలకు పంపింగ్ చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను సందర్శించి, అక్కడి నుంచి తమ ప్రాంతానికి నీటిని తీసుకుపోయేందుకు మెయిన్ కాల్వల వద్ద ఉన్న గేట్‌వాల్వ్‌లను కార్యకర్తలతో విప్పించడం సరికాదన్నారు. చేర్యాల ప్రాంత ప్రయోజనాల కోసం నిర్మించిన తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటిని ఇక్కడి రైతులకు ఉపయోగపడిన తర్వాతనే ఇతర ప్రాంతాలకు తీసుకెళితే బాగుంటుందన్నారు. దేవాదుల అధికారులు తక్షణమే స్పందించి చేర్యాల ప్రాంత చెరువులు నింపాలని పల్లా సూచించారు.

హనుమకొండలోని ఇండోర్ స్టేడియం

ఇండోర్ స్టేడియాలు ఖాట్!

రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌ను స్పోర్ట్స్ సిటీగా తీర్చిదిద్దుతామన్న పాలకుల మాటలు ఉత్తవే అని తేలిపోయింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలో నాలుగు ఇండోర్ స్టేడియాలు నిర్మించాలన్న ప్రతిపాదన ఎగిరిపోయింది. స్మార్ట్ సిటీ పథకం కింద పనులు చేపట్టందుకు బోర్డు ఆమోదం పొందిన జాబితా బుట్టదాఖలైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున ఇండోర్ స్టేడియాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చింది. అప్పటి ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల పరిధిలో స్థలాలను సైతం గుర్తించారు. గ్రేటర్ ఇంజినీర్లు టెండర్ల ప్రక్రియ ప్రారంభించగా కొన్నింటికి సింగిల్ టెండర్లు వచ్చాయి. మరికొన్నింటికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అధికారులు రెండోసారి టెండర్లు పిలిచారు. ఇదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఈ ప్రక్రియ వాయిదా పడింది. కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇండోర్ స్టేడియాల ప్రతిపాదనలను ఏకంగా పక్కన పడేశారు.

- వరంగల్, సెప్టెంబర్ 28

- రూ. 20 కోట్ల నిధులు ఇతర పనులకు మళ్లింపు
- బుట్టదాఖలైన స్పోర్ట్స్ సిటీ ప్రతిపాదనలు
- నిరాశలో నాలుగు నియోజకవర్గాల క్రీడాకారులు

స్మార్ట్ సిటీ పనుల జాబితా నుంచి తొలగింపు

జీడబ్ల్యూఎంసీ పరిధిలోని తూర్పు నియోజకర్గంలో ఓ సిటీ, పశ్చిమలో రెండు ప్రాంతాలు, పరకాల పరిధిలో కీర్తి నగర్, వర్ధన్నపేట నియోజకవర్గంలో జక్కలొద్ది వద్ద ఇండోర్ స్టేడియాలు నిర్మించేందుకు అధికారులు స్మార్ట్ సిటీ ఆమోదం తీసుకున్నారు. ఒక్కో స్టేడియానికి రూ. 5 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం గ్రేటర్ అధికారులు స్మార్ట్ సిటీ పనుల జాబితా నుంచి ఈ ప్రతిపాదనలు తొలగించారు. రూ. 20 కోట్లతో చేపట్టాల్సిన ఇండోర్ స్టేడియాల ప్రతిపాదలను తొలగించడంతో స్మార్ట్ సిటీ నిధులపై ఆశలు సన్నగిల్లాయి. మళ్లీ కొత్తగా ప్రతిపాదనలు పెట్టే అవకాశాలు కూడా లేవు. స్మార్ట్‌సిటీలో ఉన్న ప్రతిపాదనలను తొలగించి, మళ్లీ కొత్తగా రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని ఇటీవల బల్దియా కౌన్సిల్ సమావేశానికి వచ్చిన మంత్రి కొండా సురేఖ చెప్పడం కొసమెరుపు.

నిధుల మళ్లింపు

ఇండోర్ స్టేడియాల నిర్మాణానికి కేటాయించిన నిధులను గ్రేటర్ అధికారులు ఇతర పనులకు మళ్లించారు. ఇందుకోసం స్మార్ట్ సిటీ బోర్డు నుంచి ఆమోదం తీసుకున్నారు. ఈ నిధులను నగరంలో వరదతో నష్టపోయిన ప్రాంతాల పునరుద్ధరణతో పాటు ఇతర అభివృద్ధి పనులకు ఖర్చు చేశారు. స్మార్ట్ సిటీలో ఇండోర్ స్టేడియాలు నిర్మిస్తే తమకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవని, తమ ఆశలన్నీ నీరుగారాయని నగర క్రీడాకారులు వాపోతున్నారు.

ఫ్యాక్షన్ రాజకీయాలు చేద్దామా

- కొమ్మూరి సిద్ధమైతే మేము రెడీ
- బీసీలపై కక్షపూరిత రాజకీయాలు
- కేసులతో భయపెట్టాలని చూడొద్దు
- నిన్ను తరికొట్టేందుకు కార్యకర్తలు సిద్ధం
- జనగామ కాంగ్రెస్ సీనియర్ నాయకుల ఫైర్

మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు

జనగామ, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : 'జనగామలో ఫ్యాక్షన్ రాజకీయాలు చేద్దామా.. నువ్వు సిద్ధపడితే చెప్పు.. ఎదుర్కొనేందుకు మేము రెడీ.. స్పెండ్ బూచీ చూపించి కేసులతో భయపెట్టాలని చూడొద్దు.. కాంగ్రెస్ పార్టీలో బీసీలపై కక్షపూరిత రాజకీయాలు మానుకో.. నీవద్ద మేం డబ్బులు తీసుకున్నట్లు కొమురవెల్లి మల్లన్న సాక్షిగా తడి బట్టలతో ప్రమాణానికి సిద్ధమైతే మేం వస్తాం' అంటూ డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై ఆ పార్టీ సీనియర్ నాయకులు ఫైర్ అయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలోని మాజీ మున్సిపల్ వైర్‌పర్సన్ వేమళ్ల సత్యనారాయణరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ పీసీసీ రాష్ట్ర కార్యదర్శి కంచె రాములు, మాజీ మున్సిపల్, మార్కెట్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, సర్వల నర్సింగరావు, దూడల సిద్ధయ్య తదితరులు మాట్లాడారు. కొమ్మూరి జిల్లా అధ్యక్షుడు అయినప్పటి నుంచే వర్గపోరు పెరిగిందన్నారు. ప్రశాంతంగా ఉన్న జనగామలో ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తున్న కొమ్మూరిని తరిమికొట్టేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కాంగ్రెస్‌లో బీసీ నాయకులను రాజకీయంగా ఎదగకుండా కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కొమ్మూరి కోవర్టు రాజకీయాలు చేస్తున్నారని, కొందరు చెప్పిన మాటలతో సీనియర్లను దూరం పెట్టడం వల్లే పార్టీలో అనిశ్చితి నెలకొన్నదన్నారు. 40ఏండ్లుగా పార్టీ కోసం సైనికుల్లా పనిచేస్తున్న సీనియర్లను నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని వారు ధ్వజమెత్తారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి నుంచి రూ.3 కోట్లు తీసుకున్నట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని, లేకుంటే కొమ్మూరి రాజకీయ సన్యాసం చేయాలని మాజీ మున్సిపల్ చైర్మన్ వై సుధాకర్ సవాల్ విసిరారు. సమావేశంలో గంగరబోయిన మల్లేశ్, రామగల్ల విజయ్, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, గుండా శ్రీధర్‌రెడ్డి, కొత్త కరుణాకర్‌రెడ్డి, దాసరి శేఖర్, జాయ మల్లేశ్, లింగాల రాజేందర్‌రెడ్డి, గుజ్జల మధు, సరాబు మధు, తోట సత్యం, చిర్ర హన్మంతరెడ్డి, గనిపాక మహేందర్, సలేంద్ర శ్రీనివాస్, కాముని శ్రీనివాస్, పర్శరాములు, బాల్నె సురేశ్, వంచ వెంకట్‌రెడ్డి, వేముల మల్లేశ్, కనకరాజు, శివ, సత్యనారాయణ, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

జీరో మిల్లర్లపై కేసులు

పౌరసరఫరాల సంస్థ డీఎం సంధ్యారాణి

నమస్తే ఎఫెక్ట్

వరంగల్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : వరంగల్ జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అసలే డెలివరీ చేయని రైస్ మిల్లర్లపై ఈ నెల 30 తర్వాత క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సంధ్యారాణి వెల్లడించారు. ఇప్పటికే సీఎంఆర్ డెలివరీ చేయని రెండు రైస్‌మిల్లుల యజమానులపై క్రిమినల్ కేసులను నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. జిల్లాలో ప్రభుత్వం నుంచి గత వానకాలం ధాన్యం పొందిన రైస్‌మిల్లర్లలో కొందరు అసలే సీఎంఆర్ డెలివరీ చేయకపోవటంపై శనివారం 'నమస్తే తెలంగాణ'లో 'సీఎంఆర్ డెలివరీ జీరో!' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన డీఎం సంధ్యారాణి ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు రైస్ మిల్లర్లు 29,483 టన్నుల సీఎంఆర్ డెలివరీ చేశారని, ఇంకా 8,737 టన్నులు చేయాల్సి ఉందన్నారు. ఖిలావరంగల్ మండలం బొల్లికుంట లోని సౌభాగ్య ఆగ్రో ఇండస్ట్రీస్ 535.384, నెక్కొండ మండలం చంద్రుగొండలోని శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్ 602.786 టన్నుల సీఎంఆర్ డెలివరీ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు చేయలేదని, పలుమార్లు యజమానులకు షోకాజ్ నోటీసులిచ్చామన్నారు. డీటీసీఎస్ ద్వారా పంచనామా చేసి ఈ నెల 30 తర్వాత ఆ రెండు రైస్‌మిల్లుల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. చంద్రుగొండలోని శ్రీమల్లికార్జునస్వామి రైస్ మిల్, సంగెం మండలం కాపులకనపర్తిలోని సతీశ్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లర్లతో అదనపు కలెక్టర్ సమావేశాలు నిర్వహిస్తూ గడువులోగా డెలివరీ చేయాలని ఆదేశించారన్నారు. సీఎంఆర్ డెలివరీ పూర్తిచేయని రైస్ మిల్లర్లపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు సంధ్యారాణి పేర్కొన్నారు.

డబుల్ బెడ్రూం లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

పేదలను దగా చేస్తున్న ప్రభుత్వం

- డబుల్ బెడ్రూం బాధితులకు అండగా ఉంటా
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- లబ్ధిదారులతో కలిసి జనగామ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత

జనగామ, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలను దగా చేస్తున్నదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జనగామ సమీకృత కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన నిరుపేదలకు న్యాయం చేయాలని కోరుతూ పాలకుర్తి మండలం తొర్రూరు (జే) డబుల్ బెడ్రూం లబ్ధిదారులు, పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల బీఆర్ఎస్ నాయకులతో కలిసి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో నిరుపేదలకు ఇచ్చిన డబుల్ బెడ్రూం ఇండ్లను కాంగ్రెస్ సర్కార్ గుంజుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. పార్టీలకతీతంగా గ్రామసభలో అధికారులే అభ్యర్థులను ఎంపిక చేశారని, ఇందులో అందరూ పేదలే అని అన్నారు. వారికి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. పేదలకు అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, అవసరమైతే వారి పక్షాన పోరాడుతామని, న్యాయం జరిగే వరకు కొట్లాడుతామని స్పష్టం చేశారు. తొర్రూరు (జే) డబుల్ బెడ్రూం బాధితులకు అండగా ఉంటానని ఎర్రబెల్లి హామీ ఇచ్చారు.

కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న కార్మిక, సీఐటీయూ నాయకులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

కార్మిక చట్టాలు అమలు చేయాలి
హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా

హనుమకొండ, సెప్టెంబర్ 28 : మున్సిపల్, ఇతర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు టీ ఉప్పలయ్య డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలకు పెంచడంతో పాటు కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటలాడుతున్నాయని విమర్శించారు. గత ఎన్నికల్లో కార్మికులు బీజేపీకి బుద్ధి చెప్పనప్పటికీ మార్పు రాలేదన్నారు. అనంతరం డీఆర్‌వో వైవీ గణేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో సీఐటీయూ మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేశ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు యాస బాబు, మాతంగి నవనీత, కాజీపేట, హసన్‌పర్తి మండలాధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జలగంగ.. ఉప్పొంగంగ

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమీపంలోని ఓ బోరుబావి నుంచి జలగంగ ఉబికి వస్తున్నది. ఎలాంటి మోటర్ సహాయం లేకుండానే బోరులో నుంచి నీరు పైకి వస్తుండడంతో అమ్మవార్ల దర్శనానికి వస్తున్న భక్తులతో పాటు వాహనదారులు ఆసక్తిగా చూస్తున్నారు. ఆరు ఇంచుల వెడల్పుతో ఉన్న ఈ బోరుబావి నిండుగా నీరు ఎత్తిపోస్తుండటం విశేషం.

- తాడ్వాయి, సెప్టెంబర్ 28

భగ్గుమన్న వంట నూనెలు

- పండుగల ముందు ఆకాశాన్నంటిన ధరలు
- లీటర్‌కు రూ. 25 నుంచి రూ. 30 వరకు పెరుగుదల
- పేద ప్రజలపై పడనున్న అదనపు భారం
- సద్దులు, దసరాకు పిండి వంటలు కష్టమే

మహబూబాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : బహిరంగ మార్కెట్లో వంట నూనెల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఇప్పటికే నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటిన విషయం తెలిసిందే. తాజాగా వివిధ కంపెనీల వంట నూనెల ధర రూ. 25 నుంచి రూ. 30 వరకు పెరగడంతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూనెపై సుంకాన్ని పెంచడమే ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. కాటన్ నూనె లీటర్ ప్యాకెట్ రూ. 100 ఉండగా తాజాగా రూ. 125కు చేరింది. పామాయిల్ రూ. 100 నుంచి రూ. 125కు చేరింది. ఇక సన్ ఫ్లవర్, ఫ్రీడం, శుభం తదితర నూనెలు రూ. 110 నుంచి రూ. 115 ఉండగా ఇప్పుడు రూ.125 నుంచి రూ.130 వరకు చేరింది. ఐదు లీటర్లు నూనె డబ్బా రూ. 525 ఉండగా ప్రస్తుతం రూ. 640కు చేరింది. అంటే ఏకంగా రూ.115 పెరిగింది. ఇక 15 లీటర్ల డబ్బా రూ.300 నుంచి రూ. 350 వరకు చేరింది. నూనె ధరలు ఒక్కసారిగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న సద్దుల బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా నూనె ధరలు మరింత ప్రియం కానున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. పండుగ సమయంలో నూనె ధరలు పెరగడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూనెలపై సుంకాన్ని పెంచడమేమిటని ప్రశ్నిస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి ఆర్థిక భారం పడుతుండడంతో పండుగలకు ఇళ్లల్లో పిండి వంటలు చేసుకోవడం కష్టమేనంటూ సామాన్య ప్రజలు నిట్టూరుస్తున్నారు.

కాజీపేటలో బాలుడి కిడ్నాప్

- పట్టించుకోని పోలీసులు
- లబోదిబోమంటున్న తల్లిదండ్రులు

కిడ్నాప్‌నకు గురైన బాలుడి తల్లిదండ్రులు

కాజీపేట, సెప్టెంబర్ 28 : కాజీపేట పట్టణంలో గుర్తుతెలియని వ్యక్తులు బాలుడిని అపహరించుకుపోయిన ఘటన శనివారం కలకలం సృష్టించింది. బాధితులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. వరంగల్ రంగశాయిపేట ప్రాంతానికి చెందిన ఎస్‌కే మసూద్-కౌసర్ దంపతులు బతుకుదెరువు కోసం జనగామకు వెళ్లేందుకు తమ కుమారులు అయాన్ (5), ఇఫ్తాన్‌ను తీసుకుని శుక్రవారం సాయంత్రం కాజీపేట రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో రైళ్లు లేకపోవడంతో రైల్వే ఇనిస్టిట్యూట్ గేట్ సమీపంలో ఉన్నారు. కౌసర్ ఇఫ్తాన్‌ను తీసుకుని ఆహారం తీసుకొచ్చేందుకు చౌరస్తాకు వెళ్లింది. కొంత సమయం తర్వాత మసూద్ అయాన్‌ను ఇనిస్టిట్యూట్ గేట్ సమీపంలోనే వదిలి లగేజీని పట్టుకుని రైల్వే స్టేషన్‌లోకి వెళ్లాడు. భార్యాభర్తలు కొద్దిసేపటికి అక్కడకు చేరుకోగా, అయాన్ కనిపించక పోవడంతో ఆ ప్రాంతమంతా వెతికారు. ఈ క్రమంలో అక్కడ ఉన్నవారు ముస్లిం దంపతులు అయాన్‌ను ఆటోలో ఎక్కించుకుని వెళ్లినట్లు చెప్పారు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి పోలీసులు వచ్చి అక్కడివారిని అడిగి వెళ్లారు. శుక్రవారం సాయంత్రం నుంచి అయాన్ కోసం వెతుకుతున్నామని జాడ తెలియడం లేదని, పోలీసులను అడిగితే వెదుకుతున్నాం.. దొరకలేదంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ పట్టించుకోవడం లేదని ఆ దంపతులు వాపోయారు.

యువజనోత్సవాల్లో ఉపాధ్యాయుల నిరసన

కలెక్టర్ పాల్గొన్న కార్యక్రమంలో టీచర్ల నిర్వాకం

నిరసన తెలుపుతున్నఉపాధ్యాయులు

ములుగు, సెప్టెంబర్ 28 (నమస్తేతెలంగాణ) : ఉపాధ్యాయుల సర్దుబాటును ప్రభుత్వం సవరించాలని డిమాండ్ చేస్తూ పలువురు ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి చేసిన నిరసన ములుగు జిల్లా కేంద్రంలో చర్చనీయంగా మారింది. వివరాల్లోకి వెళితే... బండారుపల్లి గిరిజన భవన్‌లో నిర్వహించిన యువజనోత్సవాల కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్ దివాకర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా వచ్చిన శిరుప సతీశ్‌కుమార్, కొండ్లె కృష్ణమూర్తి, మహ్మద్ ఫిరోజ్, గన్‌రెడ్డి ఆదిరెడ్డి, గండు కుమార్, అనిత, మహ్మద్ హమీద్, రవి, బల్గూరి వేణు, బండారి జగదీశ్ కార్యక్రమం జరుగుతుండగానే నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, ఆదర్శంగా ఉండాల్సిన ఉపాధ్యాయులు ఐఏఎస్ పాల్గొన్న కార్యక్రమంలో ఇలా చేయడం సరికాదని పలువురు హితవు పలికారు.

పశువుల అక్రమ రవాణా వాహనం బోల్తా

- 13 మూగజీవుల మృతి
- పరారీలో డీసీఎం డ్రైవర్
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ నర్సయ్య
- గోశాలకు 25 లేగ దూడల తరలింపు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆవులు, లేగదూడలు

పాలకుర్తి రూరల్, సెప్టెంబర్ 28 : రోడ్డు ప్రమాదంలో 13 లేగ దూడలు మృతి చెందిన ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాలలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి హైదరాబాద్‌లోని కబేలాల కోసం డీసీఎంలో 51 లేగ దూడలను తరలిస్తున్నారు. పాలకుర్తి మండలం వావిలాల మూల మలుపు వద్దకు రాగానే డీసీఎం డ్రైవర్ అతి వేగం, నిర్లక్ష్యం కారణంగా అదుపు తప్పి బోల్తాపడింది. అందులో ఉన్న 13 లేగ దూడలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 13 గాయపడ్డాయి, పశు వైద్యాధికారి అశోక్‌రెడ్డి వాటికి వైద్య పరీక్షలు చేశారు. మిగిలిన 25 లేగ దూడలను పోలీస్ అధికారులు గోశాలకు తరలించారు. డీసీఎం డ్రైవర్ పరారయ్యాడని, జంతు నిరోధక చట్టం ప్రకారం అతడిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య పరిశీలించారు.